# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 29-01-2025 సమయం : సాయంకాలం 6 గం. 28 ని. లు

## ముఖ్యాంశాలు

- దేశంలోనే తొలిసారిగా వాట్సప్ గవర్నెన్స్‌కు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.
- ఆంధ్రప్రదేశ్‌లో పట్టభద్రులు, ఉపాధ్యాయుల శాసనమండలి సభ్యుల స్థానాలను భర్తీ చేసేందుకు భారత ఎన్నికల సంఘం ఈరోజు షెడ్యూల్‌ను విడుదల చేసింది.
- సింహాచలం పంచగ్రామాల భూ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు.
- భారత గణతంత్ర దినోత్సవ పరేడ్ లో ప్రదర్శించిన శకటాల్లో ఆంధ్రప్రదేశ్ ఏటికొప్పాక బొమ్మలు శకటానికి 3వ స్థానం లభించింది.

========================

దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పౌరసేవలు అందించేందుకు, ప్రజల నుంచి వినతులు స్వీకరించేందుకు, వారికి అవసరమైన సమాచారాన్ని చేరవేసేందుకు వాట్సప్ గవర్నెన్స్‌కు శ్రీకారం చుట్టింది. రేపటి నుంచి ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయి. వాట్సప్ గవర్నెన్స్‌పై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు సమీక్ష నిర్వహించారు. మొదటి విడతలో 161 పౌరసేవలు అందుబాటులోకి రానున్నాయి ఇందులో భాగంగా ప్రభుత్వం అధికారిక వాట్సప్ నంబర్‌ను ప్రకటించనుంది. ఈ సేవలను ఐటీ, విద్యా శాఖా మంత్రి నారా లోకేష్ రేపు అధికారికంగా ప్రారంభించనున్నారు.

========================

రాష్ట్రంలో మరో రెండు నెలల్లో పదవీ కాలం ముగియనున్న రెండు పట్టభద్రులు, ఒక ఉపాధ్యాయుల శాసనమండలి సభ్యుల స్థానాన్ని భర్తీ చేసేందుకు భారత ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ప్రకటించింది. ఉభయగోదావరి జిల్లాలు, గుంటూరు, కృష్ణా నియోజకవర్గాల్లో రెండు పట్టభద్రుల స్థానాలు, శ్రీకాకుళం - విజయనగరం - విశాఖ జిల్లాలోని ఒక ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికలను నిర్వహిస్తున్నట్టు వెల్లడించింది. ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ జారీ కానుందని తెలిపింది. 10వ తేదీన నామినేషన్లకు ఆఖరు గడువు కాగా, 11న పరిశీలన, 13న ఉపసంహరణ ప్రక్రియ ఉంటుందని

ఎన్నికల సంఘం ప్రకటించింది. ఫిబ్రవరి 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్, మార్చి 3న ఓట్ల లెక్కింపు, అనంతరం ఫలితాల వెల్లడి ఉంటుందని స్పష్టం చేసింది. ప్రస్తుతం రాష్ట్రంలోని పట్టభద్రుల స్థానాలకు ఐలా వెంకటేశ్వరరావు, కె.ఎస్. లక్ష్మణారావు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పాకాలపాటి రఘువర్మ కొనసాగుతున్నారు. ఈ ముగ్గురి పదవీకాలం మార్చి 29తో ముగియనుంది.

=========================

రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వంతో సమస్యల పరిష్కారానికి సానుకూల వాతావరణం ఏర్పడిందని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. ఈ రోజు సచివాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సింహాచలం పంచగ్రామాల భూ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారు. సుమారు 500 ఎకరాల భూమిని ప్రత్యామ్నాయంగా ఇచ్చి 12 వేల 149 ఇళ్లను క్రమబద్ధీకరించేందుకు నిర్ణయించామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయం మేరకు 420 ఎకరాలకు బదులుగా 610 ఎకరాలు సింహాచలం దేవస్థానానికి తిరిగి ఇచ్చేందుకు నిర్ణయించారని పేర్కొన్నారు. గాజువాక ప్రాంతాల్లో సింహాచలం దేవస్థానానికి 610 ఎకరాలు ఇస్తూ... చందనం చెట్లను పెంచుకునేందుకు అవకాశం వున్న చోట భూమిని కేటాయిస్తామని మంత్రి పేర్కొంటూ.....

(వాయిస్ 36 సెకన్లు)

=========================

భారత గణతంత్ర దినోత్సవ పరేడ్ లో ప్రదర్శించిన శకటాల్లో ఆంధ్రప్రదేశ్ ఏటికొప్పాక బొమ్మలు శకటానికి 3వ స్థానం లభించింది. తొలి రెండు స్థానాల్లో ఉత్తర ప్రదేశ్, త్రిపుర రాష్ట్రాలు నిలిచాయి. కేంద్ర రక్షణ మంత్రిత్వశాఖ ఈ మేరకు ఫలితాలను ప్రకటించింది.

=========================

ఉత్తరాంధ్ర ఇలవేల్పు, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా గిరిజన జాతరగా గుర్తింపు పొందిన శంబర పోలమాంబ అమ్మవారి అనుపోత్సవ కార్యక్రమం ఈరోజు ఘనంగా జరిగింది. ఆలయ కార్యనిర్వహణ అధికారి వి.వి.సూర్యనారాయణ ఆధ్వర్యంలో చదురుగుడి నుండి అమ్మవారిని వనం గుడిలోకి ప్రవేశపెట్టడంతో మొదటి వారం ఉత్సవం ముగిసింది. దీంతో వచ్చే సంవత్సరం వరకు వనంగుడి వద్ద అమ్మవారి భక్తులు మొక్కులు తీర్చుకుంటారు. ఫిబ్రవరి 4న వనంగుడి వద్ద మారుజాతర జరగనుంది. అలాగే మిగిలిన 8 వారాల జాతర కూడా ఇక్కడే నిర్వహిస్తారు. ఈ 10 వారాల జాతర అనంతరం మహా చండీ హోమం చేపట్టి అన్నదాన కార్యక్రమంతో ఈ ఏడాది జాతరకు దేవాదాయ శాఖ ముగింపు పలకనుంది.

విరామం

=========================

ప్రజలు రహదారి భద్రతా నియమాలు పాటించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. గుంటూరు కలెక్టర్ కార్యాలయంలో రహదారిభద్రతా మాసోత్సవాలలో భాగంగా నిర్వహించిన ర్యాలీలో కేంద్రమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భం మాట్లాడుతూ... హెల్మెట్లు, సీటు బెల్టులు వినియోగించటం వల్ల రోడ్డు ప్రమాదాలు, తద్వారా మరణాల సంఖ్యను అరికట్టవచ్చి తెలిపారు.

(వాయిస్ 26 సెకన్లు)

=========================

ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమలను స్థాపించేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావడం శుభ పరిణామమని గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఈ రోజు కృష్ణా జిల్లా మచిలీపట్నంలో పాత్రికేయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ దావోస్ పర్యటన విజయవంతమైందని, 6 లక్షల 35 వేల కోట్ల రూపాయలతో ఎం ఓ యు లు కుదుర్చుకోవడం జరిగిందని తెలిపారు. బిపిసిఎల్, లులు గ్రూప్స్, హెచ్ సి ఎల్, మైక్రోసాఫ్ట్ వంటి పలు సంస్థలు విశాఖపట్నం, శ్రీకాకుళం, పాయకరావుపేట, మచిలీపట్నం ప్రాంతాల్లో సంస్థలు నెలకొల్పేందుకు ముందుకు వచ్చాయని తెలిపారు. రాష్ట్రంలో వివిధ సంస్థల రాకతో యువతకు ఉద్యోగ అవకాశాలు ఏర్పడి నిరుద్యోగ సమస్య తీరుతుందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో మచిలీపట్నం పోర్టు పనులు 42 శాతం పూర్తయ్యాయని మంత్రి వెల్లడించారు.

========================

ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న దేశాల్లో భారతదేశం 3వ స్థానంలో నిలిచేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విశేష కృషి చేశారని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. తిరుపతిలో ఈ రోజు మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... జిఎస్ఎల్.వి.ఎఫ్-15 రాకెట్ ప్రయోగం విజయవంతం కావడంపై హర్షం వ్యక్తం చేశారు. నూతన ప్రయోగాలకు నిధులు కేటాయించడం, శాస్త్రవేత్తలను అన్ని విధాలుగా ప్రధానమంత్రి ప్రోత్సహించడంతో ఈ విజయాలు సాధ్యమవుతున్నాయన్నారు. ఇస్రో శాస్త్రవేత్తలను మంత్రి ఈ సందర్భంగా అభినందించారు. ప్రభుత్వ ఆసుపత్రులలో మౌలిక వసతులను పూర్తి స్థాయిలో కల్పించే ప్రయత్నం చేస్తున్నామని మంత్రి తెలిపారు.

(వాయిస్ 25 సెకన్లు)

========================

అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గంలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర రవాణా, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. రాయచోటిలో ఈ రోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... నియోజకవర్గం అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తున్నమని, గడిచిన 3 నెలల్లో 15 కోట్ల రూపాయలతో 300 బోర్లను వేయించి పల్లెల్లో నీటి సమస్య లేకుండా చేస్తున్నామని తెలిపారు. దశలవారీగా అన్ని అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలందరికీ అందేలా చేర్యలు చేపడుతున్నామని వెల్లడించారు.

========================

పార్వతీపురం పట్టణంలో జీడిపప్పు ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు సంబంధించి ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ ఈరోజు స్థల పరిశీలన చేపట్టారు. రెండు జీడీపప్పు ప్రాసెసింగ్ యూనిట్లు స్థాపనకు పార్వతీపురం సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థకు కేంద్ర ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. ఇందులో భాగంగా పార్వతీపురం వ్యవసాయ మార్కెట్ యార్డులోని గోదాముల్లో జీడిపప్పు ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనకు గల అనుకూల పరిస్థితులను పరిశీలించారు.

========================

జిల్లాలో పర్యాటకరంగ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ రోజు చిత్తూరులో జిల్లాలో కలెక్టర్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ... పర్యాటక రంగ అభివృద్ధిలో భాగంగా వివిధ ప్రాంతాలను గుర్తించి అవసరమైన భూసేకరణ చేపట్టాలన్నారు. ఈ ప్రక్రియలో రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

========================

తుపానులు సంభవించినపుడు ప్రాణనష్టాన్ని నివారించేందుకు విమానాశ్రయాల్లో అనుసరించాల్సిన అత్యవసర సహాయక చర్యలపై ఈరోజు విశాఖ విమానాశ్రయంలో మాక్ ఎక్సర్సైజ్ నిర్వహించారు. ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా టేబుల్

టాప్ ఎక్సైజ్ లో భాగంగా NDRF, AP SDRF, మెడికల్, పోలీస్, ఫైర్ సర్వీస్ బృందాలతో సహా ఇతర భాగస్వామ్య సంస్థలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నాయి.

==========================

==========================